
# జారుడుబిల్ల

పలిగడ్డ విశ్వనాథరావు

''రమణమూర్తీ, కంగ్రాట్స్'' అన్నాడు జోగారావు రమణమూర్తి రూమ్‌లోకి వచ్చి.

''రావోయ్ జోగారావ్! కాని కంగ్రాట్స్ దేనికి...ప్రమోషనా, గాడిద గుడ్డా, అదే అసిస్టెంట్ డైరెక్టర్ పదవేగా?''



''అది సరేలే. ఇన్నేళ్ళు లిటిగేషన్ శాఖలో పనిచేసి చేసి ప్రాణం విసిగిపోయిందని అంటూండేవాడివి. మరి ఇది మార్పు కాదా? అందుకని నిన్ను అభినందిస్తున్నాను.''

''నిజమే అనుకో. కాని ఇక్కడ కూడా గాడిద చాకిరీనేలే.''

''మరి విజిలెన్స్ శాఖ కదా. మన ఆఫీసులో విధా కేసులకు కొదవేమిటి?''

''దుక్కిటెద్దు దేశాంతరం వెళితే అక్కడా పట్టి దున్నించారట. అలా వుంది నా గతి.''

''నువ్వు అలా ఎందుకనుకోవాలి. నీ నిజాయితీ, కష్టపడి పనిచేసే నైజం చూసి ఈ సీటు నీకిచ్చారు. అంతేకాక నిన్ను ఎంత కాలం అలా పాత సీట్లో వుంచుతారు? మూడేళ్ళకు బదిలీ చేయాలని నియమం వుంది. అటువంటిది నువ్వు ఆ సీట్లో ఎన్నేళ్ళు వున్నావు?''

''ప్రమోషన్ వచ్చినప్పటి నుంచి ఆ సీట్లో వున్నా-అనగా ఏడేళ్ళు.''

''అంటే ఏడేళ్ళ శని తీరిందన్నమాట.''

''అలా అనుకోవడానికి ఈ సీట్లో నా కొరిగేదేమిటి, ఆ సీట్లో ఒరగని దేమిటి?''

''గౌరవం. ఈ సీట్లో భగవాన్లు వుండేవాడు. అతడు కక్కుర్తి పడేవాడని అందరూ ఏవగించుకునే వారు. అందుకేకదా అతణ్ణి మార్చి నిన్ను వేశారు.''

''గౌరవం ఏం చేసుకోను జోగారావ్!. పాతికేళ్ళ గాడిద చాకిరీ తర్వాత ఇపుడైనా తేలికైన సీటు ఇస్తారని ఆశించా.''

''మరి నీకున్న పలుకుబడి ఎవరికుంది చెప్పు?''

''వాళ్లే నీ పొగడ్తలు! ఇవాళ్టికి ఓ ఇరవై రూపాయిలు సర్దగలవా? జీతం అందగానే...?''

''నీకున్న బలహీనత ఇదొక్కటే. దాన్ని జయించగలిగావా నువ్వు పూజార్హుడివి అవుతావు. బట్ బియాస్

సారీ. చేబదులు ఇచ్చి నీ అలవాటు పాడు చేయదల్చుకో లేదని నీకు తెలుసుగా'' అని చెప్పి జోగారావు లేచి వెళ్ళిపోయాడు.

రమణమూర్తి గోడ గడియారం చూశాడు. ఆరు గంటలయింది. ఇంకో మూడు గంటలు పైమే వుంది. మహా అయితే నాలుగు గంటలు వరకు వాయిదా వేయవచ్చు.

జేబు తడుముకున్నాడు. పది రూపాయిలే వున్నాయి. 'ప్చ్...? ఇది సరిపోదే! మరల పనిలో మునిగిపోయాడు. గంట తర్వాత గోడ గడియారం వైపు చూశాడు. ఏడవుతోంది. ఇంటికెళ్ళాలి. కాని ఇంటికెళ్ళి ఏమి చేయాలి? తప్పదు కదా!'

లిటిగేషన్ శాఖలో ఉన్నప్పుడు తోటి ఉద్యోగుల చేబదుళ్ళు పుచ్చుకుని బండి నడిపేవాడు. రోజుకు కనీసం పాతిక రూపాయిలన్నా కావాలి. జీతం అందుకుని బదుళ్ళు తీర్చేసి ఇంటి ఖర్చుల మొత్తంలో కొరత పెట్టేవాడు. భార్య విసుగుకి, ఎత్తిపొడుపులకి అలవాటు పడ్డాడు.

ఐతే ఇదివరకటి చేబదుళ్ళు ఈ నెల చెల్లించలేదు. కారణం కొడుక్కి పరీక్ష ఫీజు, పెద్ద కూతురి పురిటి ఖర్చులు- ఏ మొహం పెట్టుకుని మరల వాళ్ళని అప్పు అడుగుతాడు? జోగయ్య తనకు అప్పు పెట్టడని తెలుసున్నా ఏ పుట్టలో ఏ పాముంటుందో అని ఈ రోజు నోరు తెరిచి అడిగాడు. కాని ఫలితం లేకపోయింది.

ఈ రోజు పని పూర్తి అయినట్టే. కాని ఇవాళ ఎలాగ? అది లేకుంటే నిద్రపట్టదు. నరాలు జివాలు మంటాయి. తొమ్మిదింటికల్లా అది పడితేనే తను మనిషి, లేకపోతే తాను పడే బాధ ఆ పరమాత్ముడికే తెలుసు.

ఐతే అది పడ్డాక మనిషి పశువు క్రింద మారుతాడని ప్రజలు అంటూంటారని తనలోతనే నవ్వుకున్నాడు రమణమూర్తి. ఈ రోజు ఆ చవక నాటు సరుకుతోనే కాలక్షేపం చేయాలిగాబోలు. లేనిదానికంటె నయం కదా. ఈ దురలవాటే లేకపోతే జోగారావు అన్నట్టు తనను అంతా పూజించేవారు. కాని తనకు పూజ అక్కర్లేదు.

అదిగో లక్ష్మీనారాయణ వచ్చాడు. ఇప్పుడు ఎందుకు వచ్చినట్టు? ఆఫీసు ఐదున్నర వరకే కదా! పని ఎక్కువగా ఉన్నవాళ్ళు ఆరువరకు వుండి వెళ్ళిపోతారు. ఎడ్మినిస్ట్రేషన్‌లో రామానుజం ఆరున్నర వరకే కూర్చుంటాడు. తనకి సీటు కొత్తకాబట్టి కేసులు అధ్యయనం చేసుకుంటూ ఏడు వరకు కూర్చుంటున్నాడు. లక్ష్మీనారాయణ కేర్ టేకర్. అతడి పని ఆఫీసు శుభ్రం చేయించి తాళాలు వేయించడం. అతడు మంచి మాటకారి, వ్యవహర్త. అధికారులందరినీ సుముఖంగా వుంచుకుంటాడు. నక్కజిత్తులమారి అని తనకు తెలుసు.

తనకోసమే లక్ష్మీనారాయణ వేచి వున్నట్టు వుంది. ఔను మరి. తాను కదిలితేనేగా అతడు ఆఫీసుకు తాళాలు వేయగలిగేది. 'ఇహ మీరూ వెళ్ళండి' అని సౌజ్ఞ కాబోలు అతడి రాక.

లక్ష్మీనారాయణ వచ్చి తన టేబిల్ ముందు నిల

## వసుగంటుల మల్లికార్జునరావు

# ది నీడిల్

బడ్డాడు. ''ఇహ నా పనీ ఐనట్టే లక్ష్మీనారాయణా'' అని అన్నాడు రమణమూర్తి ఫైలు నుంచి తలెత్తకుండా.

''నాకేం తొందర లేదు సార్! మీరు పని చేసుకోండి.''

రమణమూర్తి ఫైలులోంచి తలెత్తి ఓమారు అతడి వైపు చూసి మరల ఫైలులో నిమగ్నుడయాడు.

లక్ష్మీనారాయణ మరల ''చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవా అన్నారు సార్! పనిలో పడితే తమరు పొద్దెరగరు'' అని అన్నాడు.

రమణమూర్తి జవాబు చెప్పలేదు.

''సార్! ఎలక్ట్రికల్ డివిజన్ టూలో క్లర్కు జగన్నాథం వున్నాడే, వాణ్ణి తమరు ఎరుగుదురా?''

''తెలుసు''

''చాలా మంచివాడే సుమండి. ఆ మధ్యన వాడి పెళ్ళానికి వచ్చినంత పనైంది. బోలెడన్ని ఖర్చులు. అందుకని కాస్త గడ్డి కరిచాడట...''

''వాడి మీద బలమైన నిఘా కేస్ వుంది కాని దాని గురించి నీ కెందుకు?'' అని కాస్త కటువుగానే అన్నాడు రమణమూర్తి.

''అది కాదు సార్. వాడి ఉద్యోగం ఊడడం ఖాయం. పాపం పిల్లలవాడు. ఈ వయస్సులో వాడికి మరి ఉద్యోగం ఎవరిస్తారు? వాడూ, పిల్లలూ ఆకలితో అలమటించి చావడమే తప్ప, మరో మార్గంలేదు. అందువలన మీరు దయచేసి...''

''ఐతే అటువంటి దొంగని కాపాడమంటావా?''

''కాపాడమంటే అతణ్ణి బొత్తిగా విడిచిపెట్టమని కాదు సార్. ఏదో మూడు ఇంక్రిమెంట్లు ఆపివేసి వాడి ఉద్యోగం పోకుండా చూస్తే ఒకవైపు మీరు వాడి పిల్లల బతుకు వీధులపాలవకుండా కాపాడిన వారు అవుతారు. మరొకవైపు ఆఫీసు క్రమశిక్షణా నియమాలు పాటించిన వారు అవుతారు'' అని చెప్పి లక్ష్మీనారాయణ బైటకు వెళ్ళి ఒక పార్సెల్ టేబిల్ మీద వుంచాడు.

''ఇదేమిటి?''

''విదేశీ సరుకు సార్. చాలా పసందయినది. తమరి లాంటి హైక్లాస్ వారే దీని విలువ తెలుసుకోగలరు'' అని రాపర్ వేరుచేసి విస్కీ బాటిల్‌ని టేబుల్ మీద వుంచాడు. రమణమూర్తి నోట మాట రాలేదు. 'పాతికేళ్ళ సర్వీసులో ఎవరూ తనకు లంచం ఇవ్వలేదు. అసలు ఇంతవరకు అటువంటి సీటులో పనిచేయలేదు కూడా. ఈ లక్ష్మీనారాయణకి ఎంత పొగరు, ఎంత దుస్సాహసం! వీణ్ణి ఏమనాలి?!'అని అనుకొంటూండగా దృష్టి బాటిల్ మీద పడింది.

'నీ కోసమే!'అన్నట్టు పెళ్ళి కూతురిలా సొగసుగా టేబిల్‌పై నిలబడి వుంది. ఆ రాత్రి తాను తాగబోయే నాటు సారా ఎక్కడ, ఇంద్రలోకానికి మెట్ల వంటి ఈ విదేశీ సరుకు ఎక్కడ? ఎడ్ల బండికి, ఎయిర్ బస్‌కి వున్నంత తేడా వుంది.

కాని అంతరాత్మ అడ్డువచ్చి 'ఇది లంచం, నీ పాతికేళ్ళ మచ్చలేని సర్వీసుని ఈ బాటిల్ తృటిలో పొట్టబెట్టుకొంటుంది. దీన్ని వాడి మొహానికేసి కొట్టి మొహం వాచేలా చివాట్లు పెట్టు' అని ఉపదేశించింది. 'ఆ జన్మసిద్ధాంతాన్ని నీ దుర్వ్యసనానికి బలి ఇస్తావా? ఇది జారుడు బల్ల సుమా! ఈ బల్ల ఎక్కావా అది క్రిందకి, ఇంకా క్రిందకి తీసుకెళుతుంది కాని, మీదకు తీసుకెళ్ళదు. కనీసం నువ్వు ప్రస్తుతం వున్న స్థాయిలో కూడా నిల్చుండనివ్వదు. నువ్వు ఇప్పుడు నీ సొంత ఆర్జనతోనే మద్యపానం చేస్తున్నావు' అని హృదయం హెచ్చరించింది.

'ఔను. ఒక బాటిల్ కోసం తన నిజాయితీని విక్రయించకూడదు!' నిశ్చయించుకుని రమణమూర్తి లక్ష్మీనారాయణతో ఏదో చెప్పబోతూ వుండగా అతడు ఐదు నూరు రూపాయిల నోట్లు తీసి బాటిల్ క్రింద వుంచాడు. సరిక్రొత్త నోట్లు. ఏపుగా ఎదిగిన పచ్చని పంటలా నిండుగా వున్నాయి.

[illegible] ఇరవై రోజుల వరకు హాయిగా ఏ ఆటంకం లేకుండా గొంతు తడుపుకోవచ్చు. మరి పెళ్ళాన్ని కాని, తోటి అధికార్లని కాని యాచించనవసరం లేదు. 'తీసుకో రమణమూర్తీ! జగన్నాధాన్ని రక్షించిన వాడివి అవుతావు, మాకు ప్రాణం పోసిన వాడివి అవుతావు' అన్నాయి అతడి నరాలు. లక్ష్మీనారాయణ నమ్మకస్తుడే. అతడు తర్వాత ఏ గొడవా లేవదియ్యడని తనకు తెలుసు.

రమణమూర్తి మౌనం అంగీకారంగా భావించి లక్ష్మీనారాయణ బైటకు జారుకున్నాడు. రమణమూర్తి బాటిల్, డబ్బు బ్రీఫ్ కేసులో సర్దుకున్నాడు.

రమణమూర్తి పాతికేళ్ళ సద్వర్తనను బాటిల్ గటగటా త్రాగేసి ముసిముసి నవ్వు నవ్వింది.

ఇప్పుడు రమణమూర్తి లక్ష్మీ నారాయణను పిలిచి, ''చూడు లక్ష్మీనారాయణా, స్టోర్స్‌లో ఆత్మారామ్‌పై చాలా సీరియస్ చార్జీలు వున్నాయి. వాడి ఉద్యోగం పోవడం ఖాయం. పాపం వాడ్ని కాపాడాలని వుంది నాకు'' అంటాడు. వెంటనే లక్ష్మీనారాయణ సదరు ఆత్మారాముని కలుసుకొని అతన్నుంచి ఒక విదేశీ బాటిల్, ఐదు వందల రూపాయిలు వసూలు చేసి రమణమూర్తి ముందు వుంచుతాడు.